మూడు రోజులుగా మురుగు పరుగు



మూడు రోజులుగా ఆర్టీసీ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు

ఎల్బీనగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎల్బీ నగర్ ఆర్టీసీ కాలనీ ప్రధాన రహదారిపై మూడు రోజులుగా మురుగు నీరు పారుతుంది. రోడ్డు నంబర్ 4 సమీపంలోని శ్రీజగదీష్ జ్యూవెల్లర్స్ దుకాణం ముందు ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తుంది. అదేవిధంగా సిరినగర్‌లో సైతం డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు ఎగిసిపడి రోడ్డుపై పరుగుపెడుతున్నది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇన్‌స్ట్రక్టర్ల ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్బీనగర్ : సరూర్‌నగర్ మండల పరిధిలో నూతనంగా ఎంపికైన ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్స్, ఆయా ఉద్యోగాల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతున్నదని మండల విద్యాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగానికి ఇంటర్, ఆయా ఉద్యోగానికి ఏడవ తరగతి ఉత్తీర్ణులైన మండల పరిధిలోని స్థానిక మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండల పరిధిలోని చంపాపేట ప్రాథమిక పాఠశాల, భూపేష్‌గుప్తానగర్ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా ఉద్యోగాలపై ఆసక్తి గల మహిళా అభ్యర్థులు సెప్టెంబర్ 6లోగా సరూర్‌నగర్ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా లక్ష్మీగణపతి హోమం

కొత్తపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కొత్తపేట స్నేహపురికాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శ్రీనివాస మండపంలో ఆదివారం వేదమంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి విజయగణపతి ఉత్సవమూర్తికి ప్రత్యేక పంచామృత అభిషేకం, విశేష అర్చన చేశారు. అనంతరం శ్రీలక్ష్మీగణపతి హోమం 1008 సార్లు మూలమంత్రం జపిస్తూ కనులపండువగా నిర్వహించారు. పూర్ణాహుతి ఘట్టం, నీరాజనం, మంత్రపుష్పార్చనతో హోమం ముగిసింది. పరిసర కాలనీల భక్తులు పెద్ద సంఖ్యలో హోమ కార్యక్రమానికి విచ్చేశారు.

ఉద్యోగ విరమణ జీవితంలో మైలురాయి లాంటిది



ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు లక్ష్మీకళ్యాణితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొత్తపేట : ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ జీవితంలో మైలురాయి లాంటిదని కొత్తపేట జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నరసింహం తెలిపారు. హిందీ ఉపాధ్యాయురాలు లంకె లక్ష్మీకళ్యాణి ఉద్యోగ వివమణ అభినందన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో మంచి పౌరులను తయారు చేసే ఉదాత్తమైన బాధ్యత అన్నారు. చదువు సంధ్యలతో పాటు విద్యార్థుల క్రమశిక్షణ, మానవతా విలువల ప్రాధాన్యతలను గుర్తించేలా బోధించేది ఉపాధ్యాయులేనని ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. ఉద్యోగ విరమణ పొందిన లక్ష్మీకళ్యాణిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీచర్లు రాంనాథ్‌రెడ్డి, చంద్రలేఖ, స్వరాజ్యలక్ష్మి, ఉమారాణి, శైలజ, భారతి, గణేశ్, మమత, సృజన పాల్గొన్నారు.

రూ.26వేలకు లడ్డూ వేలం

హయత్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ మధురానగర్‌కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద ఆదివారం లడ్డూ వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూను రూ. 26 వేలకు మహాకవి సి. నారాయణరెడ్డి కళాపీఠం చైర్మన్ మల్లెకేడి రాములు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ కౌన్సిలర్ కాకుమాను సునీల్ లడ్డూను రాములుకు అందించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

దిల్‌సుఖ్‌నగర్ : వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పీ అండ్ టీ కాలనీకి చెందిన జిమ్ ట్రైనర్ బి.రవిప్రకాష్ ఎన్నికయ్యారు. ఆదివారం 12మంది సభ్యులతో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవిప్రకాష్, ఉపాధ్యక్షులుగా నూకల పద్మారెడ్డి, మారయ్య, ప్రధాన కార్యదర్శిగా జి.అనిల్‌కుమార్, కోశాధికారిగా కె.సంజయ్, జాయింట్ సెక్రటరీలుగా జె.యశ్వంత్‌కుమార్, గోపీనాథ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బి.శ్రవణ్, రాంచందర్, కె.వి.నాగశూలపణి, కె.పూర్ణేష్, ఎస్.శశికుమార్ ఎన్నికయ్యారు.

విజయశ్రీకాలనీ నూతన కమిటీ ఎన్నిక

మన్సూరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధి విజయశ్రీకాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. కమిటీకి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా భీమిడి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా వి.మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ బాలరాజు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సుధాకర్‌రెడ్డి, పి.సతీష్‌బాబు, సంయుక్త కార్యదర్శులుగా కె.నరేందర్‌గౌడ్, బి.గులాల్‌రెడ్డి, కోశాధికారిగా ఎం.నల్లారెడ్డి, సభ్యులుగా జి.నర్సిరెడ్డి, బి.ముత్యాలు, పి.మోహన్ ఎన్నికయ్యారు.

ప్రజల సహకారంతో వేగంగా అభివృద్ధి : రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో లింగోజిగూడలో వెగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో రూ. 62లక్షలతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లో రూ. 32లక్షలతో కొత్తగా సీసీ రోడ్లు, రూ.8లక్షలతో సీవరేజీ డ్రైన్, రూ.10లక్షలతో ఓపెన్ జిమ్, రూ.12లక్షలతో ఫుట్‌పాత్ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జ్యోతిరెడ్డి, ప్రవీణ్ జూపల్లి, ప్రవీణ్‌రెడ్డి, అనూష, లక్ష్మి, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌చారి పాల్గొన్నారు.

స్టామ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు

చంపాపేట : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం కోసం రూ.6కోట్లు మంజూరైనట్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతానాయక్ తెలిపారు. కాంగ్రెస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మధుయాష్కీగౌడ్ సూచన మేరకు స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిధులు మంజూరు చేయాలని కోరగా, హయత్‌నగర్ డివిజన్‌లోని కుమ్మరిబస్తీ నుంచి బస్‌డిపో ఏరియాలోని రాఘవేంద్రనగర్‌కాలనీ వరకు రూ.6కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. హస్తినాపురం డివిజన్‌లోని ఏపీఎస్‌ఈబీ కాలనీ నుంచి పంచాయతీరాజ్ కాలనీ వరకు వరదనీటి కాలువ నిర్మాణం కోసం రూ.10కోట్లు మంజూరు చేయాలని సమావేశంలో ప్రతిపాదించినట్లు ఇందుకు మేయర్ విజయలక్ష్మి సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

సమాజాభివృద్ధిలో సీనియర్ సిటిజన్ల అనుభవాలు

మన్సూరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సమాజాభివృద్ధిలో సీనియర్ సిటిజన్ల అనుభవాలు, సూచనలు ఎంతగానో దోహదపడతాయని స్థానిక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ప్రగతినగర్‌కాలనీలో గల ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లకు ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. ఆదివారం ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కార్పొరేటర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి, సభ్యులు సత్యనారాయణ, రాంరెడ్డి, బ్రహ్మారెడ్డి, సోమిరెడ్డి, సత్యనారాయణరావు, నవనీత్‌రావు, రామచంద్రారెడ్డి, అమృతారెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డబుల్‌బెడ్రూం డిగ్నిటీ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికాలనీ, గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కేసుల ఛేదనలతో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. డబుల్ బెడ్రూం కాలనీలో 8 కెమెరాలను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మాధవరావు, సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపీ శంకర్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



సరూర్‌నగర్‌లో వినాయక మండపాన్ని దర్శించుకుని పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అరుట్ల సురేష్‌కుమార్




సరూర్‌నగర్‌లో గణపతి మండపాన్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మహేందర్‌యాదవ్ తదితరులు



వనస్థలిపురంలో వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సతీమణి దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి, ముద్దగౌని సుమన్‌గౌడ్ తదితరులు



శ్రీబాలజీనగర్‌కాలనీలో వినాయకుడిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ముడుపు సందీప్‌రెడ్డి



సైదాబాద్ విఘ్నేశ్వరయూత్ అసోసియేషన్ మహా గణపతిని దర్శించుకున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి

నేత్రపర్వంగా గణపతి నవరాత్రోత్సవాలు



బడంగ్‌పేట్ శ్రీసాయిబాలాజీ హోమ్స్‌లో గణనాథుడిని దర్శించుకున్న మాజీ మేయర్ పారిజాతారెడ్డి



జిల్లెలగూడలో వినాయకుడిని దర్శించుకున్న టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్ తదితరులు

గణపతి నవరాత్రి ఉత్సవాలు పలు ప్రాంతాల్లో నేత్రపర్వంగా సాగుతున్నాయి. భక్తుల కోలాహలం నడుమ గణనాథుడు విశేష పూజలందుకుంటున్నాడు. మండపాలు, అపార్ట్‌మెంట్‌లలో కొలువు దీరిన ఏకదంతుని విగ్రహాలకు ఐదు రోజులుగా భక్తులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. పార్వతీపుత్రుడికి పూజా కార్యక్రమాలతో పాటు మండపాల వద్ద సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు పోటాపోటీగా నిర్వహిస్తూ నవరాత్రులను కనులపండువగా జరుపుతున్నారు. మండపాలతో పాటు, అపార్ట్‌మెంట్‌ల వద్ద కూడా నిర్వాహకులు సాంస్కృతిక, భక్తిరస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండప అలంకరణలు, సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాల కోసం నవరాత్రులలో లక్షలాది రూపాయలు సైతం ఖర్చు చేయడానికి వెనుకంజ వేయడం లేదు. కొన్ని మండపాల వద్ద కళాకారులు, సినీ నటులను అతిథులుగా తీసుకువచ్చి మరీ భక్తులకు కనువిందు చేస్తున్నారు. శని, ఆదివారాలు రెండు రోజులుగా మండపాల వద్ద విశేష అన్నదానాలు నిర్వహిస్తుండడంతో మండపాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నవి.

జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి



హయత్‌నగర్ కాలనీల్లో గణనాథులను దర్శించుకున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు బండారు భాస్కర్, సంఘీ అశోక్, విష్ణువర్ధన్



సైదాబాద్ లక్ష్మీనగర్‌కాలనీలో లక్ష్మీ టవర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేశ్ పూజలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు తదితరులు



లక్ష్మీనగర్‌కాలనీ గణపతిని దర్శించుకున్న మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి



సరూర్‌నగర్ యూత్ క్లబ్ భారీ గణపతిని దర్శించుకున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, ఆకుల అంజన్, బీజేపీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీలో పూజల్లో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్, నిర్వాహకులు గోవుల రాములు, బొక్క గోవర్ధన్‌రెడ్డి, దండెం రాజశేఖర్‌రెడ్డి



మన్సూరాబాద్ చండీశ్వర్‌కాలనీలోని విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీ అధ్యక్షుడు జంగారెడ్డి, నిర్వాహకులు



తుర్కయంజాల్‌లో గణనాథులను దర్శించుకున్న రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు మంగమ్మ శివకుమార్



పసుమాములలో వినాయకుడిని దర్శించుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు రాంరెడ్డి, బలరాం తదితరులు



సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీ రోడ్డు నం.8లో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

బీసీ కులాల బాంధవుడు సీఎం రేవంత్‌రెడ్డి

● దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య తదితరులు

మన్సూరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులాల బాంధవుడని వికలాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. శనివారం క్యాబినేట్ సమావేశంలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న 50శాతం పరిమితిని ఎత్తివేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు నిర్ణయించి ఆదివారం అసెంబ్లీలో ఆమోదించారు. దీంతో తెలంగాణ రాష్ట్ర పెరిక(పురగిరి) క్షత్రియ కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మన్సూరాబాద్‌లోని ప్రసిద్ధ్ ఆస్పత్రి సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్న రాహుల్‌గాంధీ ఆలోచనను నిజం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌లకు బీసీ సమాజం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కోట మల్లికార్జున రావు, ఎల్బీనగర్ పెరిక కుల అధ్యక్షుడు సుందరీ వీరభాస్కర్, ఎగ్గడి శ్రీనివాస్, బాల్గూరి రవి, షైలార్శెట్టి భాస్కర్, బొరిశెట్టి లక్ష్మీనారాయణ, ప్రసిద్ధ్ ఆస్పత్రి అధినేత జూకూరి రాజు, జూకూరి మహేష్ పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

● పీవీఆర్ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు



శతాబ్ది ఉత్సవాల పోస్టరును ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలను చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు తీర్మానించారు. ఈ మేరకు ఆదివారం కేపీహెచ్‌బీ రావూస్ ఈఎన్‌టీ హాస్పిటల్ ఆడిటోరియంలో ప్రీమీట్ నిర్వహించారు. ఒంగోలు పీవీఆర్ స్కూల్‌లో చదివిన వారు దేశ, విదేశాల్లో ఉన్నత స్థాయిల్లో ఉండడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం 1925-2025 మధ్య పదో తరగతి పూర్తి చేసుకున్న సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు సమావేశమై శతాబ్ది ఉత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. ఉత్సవాల నిర్వహణ కమిటీలను ప్రకటించారు. ప్రీమీట్ కన్వీనర్‌గా వీరప్రతాప్, కోకన్వీనర్‌గా బేతంశెట్టి హరిబాబు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీజీపీ నండూరి సాంబశివరావు, రిటైర్డ్ డీఐజీ తోట వెంకటరావు, సినీ రచయిత మరుధూరి రాజా, డా.రావు, జర్నలిస్ట్ శివాజీ, ఆదిపూడి గాయత్రీ ప్రసాద్, రఘురాం, డా.పేర్ల తుని, నారా చాణక్య, శ్రీవల్లి, రాజ్యలక్ష్మి, సీతాపద్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ సమస్యల పరిష్కారానికి కృషి : అందెల

● అక్రమ మదర్సాలపై పోరాటం కొనసాగిస్తాం



సుల్తాన్‌పూర్ వాసులతో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని వెంకటాపూర్ డివిజన్ పరిధిలో గల సుల్తాన్‌పూర్ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పార్టీ తరఫున కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ పేర్కొన్నారు. సుల్తాన్‌పూర్‌లో అక్రమంగా కొనసాగుతున్న మదర్సాలను తొలగింపజేయడానికి పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. స్థానికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సుల్తాన్‌పూర్ గ్రామస్థులు ఆదివారం శ్రీరాములు యాదవ్‌ను నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో కలిసి విన్నవించారు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో మల్లాపూర్ వరకు నడిచి వచ్చి, అక్కడ బస్సులను ఆశ్రయిస్తున్నామని ఈ సందర్భంగా వారు అందెలకు వివరించారు. గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న మదర్సాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గ్రామంలో విద్య, వైద్య సౌకర్యాలు లేవని వారు వాపోయారు. అనంతరం శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. మదర్సాలను తొలగించాలనే డిమాండ్‌తో ఇప్పటికే తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం మొదలుపెట్టామని, వాటిని తొలగించే దాకా పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రావుల మల్లేశ్, పార్టీ నాయకులు నవారు శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చైతన్య, ప్రవీణ్‌గౌడ్, కిరణ్‌రాజ్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి.. శవమై తేలి..

● గల్లంతైన మూడు రోజులకు వ్యక్తి మృతదేహం లభ్యం

మన్సూరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట మూసారాంబాగ్ వద్ద మూసీ నదిలో చేపల వేటకు వెళ్లి నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ వివరాల ప్రకారం.. ఓల్డ్‌మలక్‌పేట్ శంకర్‌నగర్‌కు చెందిన మటన్‌షాప్ లో పనిచేసే మహమ్మద్ సలీం(37) గురువారం మూసారాంబాగ్ వద్ద మూసీ నదిలో చేపల వేటకు వెళ్లి అదుపుతప్పి నదిలో గల్లంతయ్యాడు. కొర్రెముల గ్రామం మూసీ బ్రిడ్జి నదిలో ఆదివారం ఓ మృతదేహాన్ని చూసిన స్థానికులు నాగోల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు డీఆర్‌ఎఫ్ సిబ్బంది సాయంతో మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించగా సలీందిగా నిర్ధారించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా మృతుడు సలీంకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

డీసీఎంను ఢీకొట్టిన బైక్

● అక్కడికక్కడే మృతిచెందిన ద్విచక్రవాహనదారుడు

వనస్థలిపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అతివేగంతో డీసీఎంను ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందగా మరొకరు గాయాలపాలైన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన చీమర్ల వంశీ(20) తన స్నేహితుడైన బడే ప్రవీణ్ అనే వ్యక్తితో కలిసి ఇబ్రహీంపట్నం నుంచి బీఎన్‌రెడ్డినగర్‌లో టిఫిన్ చేయడానికి తన బైక్ పై ఆదివారం అర్ధరాత్రి వచ్చారు. వీరిద్దరూ బీఎన్‌రెడ్డి నగర్‌లో టిఫిన్ చేసి తిరిగి ఇబ్రహీంపట్నంకు తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో సాగర్ కాంప్లెక్స్ వద్దకు రాగానే రోడ్డుపై వస్తున్న డీసీఎంను వీరు బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో చీమర్ల వంశీ అక్కడికక్కడే మృతి చెందగా.. వెనకాల ఉన్న ప్రవీణ్‌కు గాయాలు కావడంతో సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సను అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీల్లో పరివర్తనకే డీ-అడిక్షన్ కేంద్రాలు : సౌమ్య మిశ్రా



నియామకపత్రాన్ని అందజేస్తున్న జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా తదితరులు

సైదాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నేరాలకు పాల్పడి జైలుకు వచ్చిన వారిలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంతో జైళ్లలో డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. నెల రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న డీ-అడిక్షన్ సెంటర్ల సిబ్బందికి ఆదివారం చంచల్‌గూడ జైళ్లశాఖ సీకా కార్యాలయం హాల్‌లో నియామకపత్రాలను అందజేశారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్య చికిత్స, కౌన్సిలింగ్‌ల ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా నాలుగు కేంద్ర కారాగారాలలో డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైదీలు శిక్ష పూర్తి చేసుకుని బాహ్య ప్రపంచంలో వెళ్లే సమయానికి సత్ప్రవర్తన కలిగిన వారిగా తయారు చేసి సమాజానికి అందించే లక్ష్యం కోసం సిబ్బంది కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజీ మురళీబాబు, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్, సీకా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సైదాబాద్‌లోని జువనైల్ హోం డీ అడిక్షన్ సెంటర్, ధూల్‌పేట ఎక్సైజ్ స్టేషన్, ఆశా హాస్పిటల్ బంజారాహిల్స్, ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం, బస్తీలను సందర్శించారు.

ప్రధాని తల్లిని అసభ్యకరంగా దూషించడం హేయం

● బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా అక్కడి కాంగ్రెస్ నేత మహమ్మద్ రిజ్వీ అనే వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తిని అసభ్యకరంగా దూషించడం హేయమని బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యల పట్ల ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ మౌనంగా ఉండటాన్ని ఖండిస్తూ సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టి ఎల్బీనగర్ రింగురోడ్డు వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసనలో నాయకులు నాంపల్లి రామేశ్వర్, నూతి శ్రీనివాస్, సుందర్‌నారాయణ, నాగిరెడ్డి, మల్లేష్‌గౌడ్, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.



సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ రింగురోడ్డు వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో..

బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని కామినేని చౌరస్తా వద్ద ఆదివారం బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఎల్బీనగర్ పోలీసులు అక్కడకు చేరకుని ఆందోళనకారులను అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసనలో బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, నాయకులు కడియం రాంచంద్రయ్య, ఎడ్ల అమరేశ్వర్‌ముదిరాజ్, నవీన్‌రావు, శ్యాంసుందర్‌రెడ్డి, అమూల్యారెడ్డి, అన్నెపర్తి శశి, పాతూరి శ్రీధర్‌గౌడ్, మొరిశెట్టి సంతోష్‌కుమార్‌గుప్తా, మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్లు మంగారెడ్డి, అనితారెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నాగోల్ కార్పొరేటర్ అరుణ హౌస్ అరెస్టు..

ప్రధాని మోదీ మాతృమూర్తిని బీహార్ కాంగ్రెస్ నాయకులు అసభ్యకరంగా దూషించడాన్ని ఖండిస్తూ ఆదివారం నిరసన వ్యక్తం చేసేందుకు సిద్ధమైన నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్‌ను నాగోల్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. డివిజన్‌లోని పలువురు బీజేపీ నాయకులను కూడా పోలీసులు ఇంటి నుంచి కదలకుండా అడ్డుకున్నారు.



సైదాబాద్‌లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కుర్మగూడ బీజేపీ నేతలు

సైదాబాద్ : ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేసిన వాఖ్యలకు నిరసనగా సైదాబాద్ ప్రధాన రహదారిపై, ఐఎస్‌సదన్ చౌరస్తాలలో బీజేపీ నేతలు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా బీజేపీ నేతలు నినాదాలు చేశారు.

కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, అధికార ప్రతినిధి వీరేందర్ బాబు, నేతలు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనాథ్, మన్నె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
రాజు : 99854 02786